స్కెచ్

# వకుళాదేవి డైరీ

"వకుళం"

డైరీ వ్రాయడం ప్రారంభించాను.

—అబద్ధాలు ఆడకుండా ఉండడానికి ఇవాళ ఎం. ఐ. (మోరల్ ఇన్స్‌ట్రక్షన్) క్లాసులో మేష్టారు ఒక ఉపాయం చెప్పారు: చిన్న పుస్తకంకట్టి అందులో ఆడిన అబద్ధాలన్నీ వ్రాసి, అది క్లాసులో ప్రతిసారీ చదవాలిట. అంటే ఇంకెప్పుడూ మళ్ళీ ఇలాంటి పొరపాటు రానివ్వనూ అన్నమాట. అబద్ధాలపుస్తకంకట్టి అమల్లో పెట్టాను.

విశేషాల్లేవు.

అన్నయ్య దగ్గర్నుంచి ఉత్తరం వచ్చింది. మూడు వారాల్లో వస్తున్నానని.

ఏడు రోజుల్నుంచి డైరీ సంగతి మర్చిపోయాను. రేపు అన్నయ్య వస్తాడు. మావదిన పినతండ్రి చిన్నకొడుకుని తీసుకొని వచ్చారు వదినని తీసుకెళ్ళడానికి. ఆశ్చర్యంగా ఉంది రాకముందే తీసుకెళ్ళి పోతారుకాబోలు! అలా అయితే స్టేషన్లోనే కూర్చోవలసింది—వచ్చారు అన్నయ్యా వదినా ఇల్లు చిన్నది. కింద రెండుగదులూ మేడమీద ఒకగదీ ఇరుకూ, చికాకూ, పైగా వాన.

భోజనాలయేసరికి 12 గంటలైంది. అమ్మకైతే ఏకాదశి. మేం గిలగిల్లాడిపోయాం. మరి 10 గం॥ కొట్టేసరికి చేతులు కడిగేసే అలవాటు.

ఇవాళకూడా పన్నెండే. అమ్మకి ద్వాదశి శోషవస్తోంది. పైగా "నాకోసం మీరంతా ఎందుకు భోంచెయ్యలేదూ?" అని సన్నాయి నొక్కులు నొక్కేరు పెద్దమనిషి మామగారు. ఎంబ్రాయిడరీ వర్కు చేసే ఫ్రేమ్ విరిగిపోయింది వదిన సహాయంతో; అపీల్ లేదు.

అమ్మకి వంట్లో బాగులేదు. మా వదిన మేనమామ కోడలి తరఫు వాళ్ళుట వచ్చారు. వానొకటీ ఇల్లూ ఏరూ ఏకంచేస్తూ.

మేడమీద గది వదిన ఆక్రమించుకుంటోంది. తను క్రిందనుంటే చిన్నన్నయ్యా నాన్నగారూ, మామగారూ, తమ్ముడూ అంతా మేడమీది కెళ్ళొచ్చు. ఈ సంగతి తనకి అర్థంకాదు. అమ్మ నన్ను చెప్పనివ్వదు. "ఒక్కరోజులో మాట పోగొట్టుకోడ మెందుకం"టుంది.

వదిన చుట్టాలు వెళ్ళిపోయారు. వదిన పొద్దున్న కాఫీలైతేగాని లేవదు. మధ్యాహ్నం టిఫిన్ తయారయితేగాని మేడ దిగదు. కొంచెం కూడా భయంలేదు. చెప్పేవాడు లేకపోతేసరి.

"చెప్తేగాని ఏపని చెయ్యాలో తెలీదన్న" మనిషి (వదిన) ఎదురుగుండా కనిపించిన పనికూడా చేసేదిగాదు. నేను గ్లాసులుపెడితే తను మంచినీళ్లు పోస్తుంది. ముగ్గుర్నుంచీ నలుగురుఆడవారమయేసరికి నాకుకూడా పని తగుల్తోంది. అమ్మకి జ్వరం. వచ్చేపోయే చుట్టాలకి అంతూపంతూ లేనట్టుంది. అందులో కొందర్ని వదినకికూడా తెలీదట!

నాన్నగారు రాజమండ్రీ వెళ్ళారు. మామగారు కూడా అనకాపల్లి వెళ్లారు (బాగుండదని కాబోలు) ఆయన కొడుకు మటుకు ఉండిపోయాడు.

నాకు చికాకు కలిగించేవి రెండు. మొదటిది నేను చేస్తున్న పని మధ్యలోకి రావడం, రెండోది నా కాగితాలూ పుస్తకాలూ తియ్యడం, వదినతో వద్దని చెప్పలేక చచ్చేదాన్ని.

అబద్ధాల పుస్తకంనిండి పోతూంది, విసుగేసి చింపేసేను. ఆ మేష్టారు వెళ్ళిపోయారు మరి.

ఇవాళ అక్కతో దెబ్బలాడేను నన్ను 'చెల్లెమ్మా' అనొద్దని. లేకపోతే పనిమనిషికీ పాలమనిషి వదినకీ అందరికీ చెల్లెమ్మనేనా?

నాన్నగారూ వాళ్ళూ వచ్చేశారు. అమ్మకి ఉష్ణం ఎక్కువైంది. "నే నొండుతాన్లేమ్మా! ఇవాళ" అన్నాను వండనివ్వదని తెలిసే. "తీరు

తాయిలే ఆ సరదాలూను" అంది అమ్మ. పిల్లలంటే తల్లులకి అలా అనిపిస్తుంది కాబోలు!

వదిన పొడిచేసేట్టు చూస్తూంటుంది ఎందుకనో? "ఏం చూడకూడదా" అంటుంది. "చూడకూడదని కాదులే" అని నసిగేసి నవ్వేసి అక్కణ్ణుంచి లేచిపోయేను. తను గ్రహిస్తే బాగుండును ఇలాంటివన్నీ.

ఇవాళ చిన్నతమాషా జరిగింది. బాబ్జీ స్కాటు డ్రెస్‌లో వీధులో తిరుగుతున్నాడట. రోడ్డుమీద నిలబడి మా అన్నయ్య మామగారు కనిపించారట. వీడేమో "స్టేషన్ ఎక్కడో తెలీదు కాబోలు. రండి చూపిస్తా" అన్నాడట. మరి యుగాలూ జగాలూ ఎవరు భరించగలరు? అంటుంది అమ్మ. మా అమ్మమ్మా తాతగారూ అమ్మని చూడడానికి రెండురోజులు రైల్లో ప్రయాణంచేసి ఇంట్లో ఒక్కపూట ఉండేవారట. అన్నయ్యా, వాడి మామగారూ చెప్పకుండా సినిమాకి చెక్కేసి రాత్రి పదిగంటలకి తాపీగా భోజనానికొచ్చారు. మధ్యమేం మాడిచచ్చాం. ఇహ అప్పుడు ఉపన్యాసానికి తగులుక్కున్నారు. శ్రీయుతులు "కట్నాలు పుచ్చుకోకూడదట" బాగానే ఉంది. కాని "బహుమానాలూ పెళ్ళిలో చదివించే కట్నాలుకూడా పుచ్చుకోరట. మావదిన కొన్ని పుస్తకాలూ గ్లాసులూ చూపించింది మళ్ళీ! బలవంతాన ఇచ్చి వెళ్ళారట, బహుశా చిన్నచిన్నవి పుచ్చుకోరు కాబోలు. డాబు. హంబగ్. బహుమానాలు మనకిలేవనీ, కొనుక్కోలేమనీ ఇస్తారేమిటి? ఈమాటు ఏవైనా చూపించినప్పుడు అడిగేస్తాను.

అన్నయ్యా వదినా అందరూ వెళ్ళిపోయారు. ఇంకేమీ కనిపించడంలేదు డైరీకి. ★


సవారీకి హెర్క్యులీస్
WAYFARER
వేఫేరర్


స్పోర్టింగు విశిష్టతలు గల ప్రజాదరణ పొందిన నమూనా
★ సర్దుబాటుకు వీలగు కడ్డీమీద స్పోర్ట్సు టైపు ల్యాంపు బ్రాకెటుతో వంపులు తీర్చిన ఆల్ రౌండర్ హేండిల్ బార్.
★ ఫిలిప్స్ వెస్ట్‌వుడ్ కేబిల్ బ్రేకులు.
★ హెర్క్యుమాటిక్ హేండిల్ బారు అదుపులోనుండు 3 స్పీడ్ హబ్
తయారుచేయువారు:
టి. ఐ. సైకిల్స్ ఆఫ్ ఇండియా లిమిటెడ్., మద్రాసు.
పెద్ద డీలరు లందరివద్ద లభించును.
TICIOEP